కొంచెం కొంచెంగా తగ్గుతూ..


ముక్తేశ్వరం- అయినవిల్లిలంక ఎదురుబిడెం కాజ్‌వేపై వరద నీరు


టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద నుంచి పడవపై ప్రయాణం


సఖినేటిపల్లి లాకుపేట లోతట్టు ప్రాంతంలో ఓ ఇంటి వద్ద వృద్ధురాలు


టేకిశెట్టిపాలెం- అప్పనరామునిలంక మధ్య కొబ్బరి తోటలో ముంపు నీరు


అప్పనపల్లిలో కాజ్‌వేపై నిలిచిన జలాలు

- కాస్త శాంతించిన గోదావరి
- తగ్గుతున్న వరద
- ఇంకా నీటిలోనే కాజ్‌వేలు

సఖినేటిపల్లి: వణికించిన వరద వెనక్కి తగ్గుతోంది.. లంక ఇప్పుడిప్పుడే తేరుకుంటోంది. రోడ్లపై నీరు కొంచెం కొంచెంగా తగ్గుతోంది.. అప్పనరామునిలంక, రామరాజులంక మధ్య అనుసంధానంగా ఉన్న రహదారి వరద ముంపు నుంచి బయట పడడంతో రాకపోకలు కొనసాగాయి. అప్పనరాముని లంక గ్రామంలోని లోతట్టు ప్రాంతాలైన ఓఎన్జీసీ కాలనీ, మధ్యగ్రూపు, కొత్తలంక ఏరియాల్లో వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఇక్కడ శుక్రవారానికి నీరు తగ్గనుంది. అప్పనరామునిలంక, టేకిశెట్టిపాలెం గ్రామాల మధ్య గోదావరి పాయపై ఉన్న పక్కా కాజ్‌వే ఇంకా నీటిలో ఉంది. ఈ రెండు గ్రామాల మధ్య లోతట్టు ప్రాంతాల్లోని కొబ్బరి తోటలు ముంపు నీట ఉన్నాయి. గోదావరి పాయను ఆనుకుని ఉన్న సఖినేటిపల్లి లాకుపేటలో వరద తగ్గినా, లోతట్టులోని ఇళ్ల వద్ద మాత్రం నీరు తిష్టవేసింది. టేకిశెట్టిపాలెం వైపు అగ్నికుల క్షత్రియ కాలనీ, సఖినేటిపల్లి రేవు, రేవుకు ఆనుకుని ఉన్న ఇళ్ల వద్ద నీరు ప్రవహిస్తోంది. టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద వరద పరిస్థితిని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పరిశీలించారు. బాధితులకు ప్రభుత్వపరంగా అందిస్తున్న సాయంపై ఆరా తీశారు.

ప్రయాణికులకు ఇబ్బంది

మామిడికుదురు: గోదావరి వరద ఇంకా అప్పనపల్లి కాజ్‌వేను వీడలేదు. దీనిపై గురువారం నాలుగడుగులకు పైగా నీరు ప్రవహిస్తోంది. అప్పనపల్లికి పది రోజుల నుంచి ఆర్టీసీ సర్వీసును నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు దిగువన ఉన్న అప్పనపల్లి ఉచ్చులవారిపేట మార్గంలో వరద పూర్తిగా తగ్గడంతో ద్విచక్ర వాహనాలు, ఇతర చిన్న వాహనాలు మాత్రం వెళ్తున్నాయి.

అయినవిల్లి: ముక్తేశ్వరం- అయినవిల్లిలంక ఎదురుబిడెం కాజ్‌వేపై మోకాళ్లలోతు నీరు ప్రవహిస్తుంది. అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, మడుపల్లి, చింతనలంక, పొట్టిలంక, కొండుకుదురులంక, తొత్తరమూడిలోని కె.పెదలంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో ముంపు నీరు ఇంకా వీడలేదు. గ్రామాల్లో రోడ్లపైకి బురద చేరడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

రాకపోకలు ప్రారంభం

పి.గన్నవరం: వశిష్ట, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. దీంతో లంక గ్రామాలు జల దిగ్బంధనం నుంచి బయట పడుతున్నాయి. కె.ఏనుగుపల్లి, ఎల్.గన్నవరం, మానేపల్లి పల్లిపాలెం రహదారులపై వరద ఉధృతి తగ్గింది. దీంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి. మానేపల్లి శివారు శివాయలంకకు వెళ్లే దారిలో నీరు తగ్గకపోవడంతో అధికారులు ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌పై ఆ గ్రామ ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు జి.పెదపూడి రేవు నుంచి పడవలపై వెళ్తున్నారు. అక్కడ రద్దీ దృష్ట్యా ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచారు. ఇదిలా ఉండగా లంక భూముల్లోని పంటలన్నీ దెబ్బతిన్నాయి. దీంతో తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

నిండా ముంచి.. నష్టం మిగిల్చి

- కుళ్లిపోయిన పంటలు
- రైతులకు కష్టాలు


అప్పనపల్లిలో తోట నుంచి అరటి గెలలు సేకరిస్తున్న రైతులు

మామిడికుదురు: వరద నిండా ముంచింది.. రైతు కష్టాన్ని మింగేసింది.. ఆరుగాలం శ్రమించి పండించిన ప్రతి పంట ముంపునీరు బారిన పడింది. దిగుబడి చేతికి వచ్చే సమయంలో వరద తమను నిలువునా ముంచిందని రైతన్న గుండె విలపిస్తోంది. అరటి, బీర, బెండ, మునగ, బొప్పాయి, తమల పాకులు, పూల తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. లాభాల మాట ఎలా ఉన్నా రూ.లక్షల్లో నష్టపోయామని రైతులు అంటున్నారు. మామిడికుదురు మండలంలో 38 హెక్టార్లలో అరటి పంట దెబ్బతినగా, 101 మంది రైతులు నష్టపోయారని అంచనా. 45 హెక్టార్లలో కూరగాయల పంట పాడవగా, 120 మంది రైతులకు నష్టం వాటిల్లిందని హార్టికల్చర్ అధికారులు తెలిపారు. పి.గన్నవరం మండలంలో 382.30 హెక్టార్లకు 1260 మంది రైతులు, అయినవిల్లి మండలంలో 440.70 హెక్టార్లకు 1,548 మంది, అంబాజీపేట మండలంలో 19 హెక్టార్లకు 34 మంది రైతులు నష్టపోయారు. వీటితో పాటు రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లోని ఏడు మండలాల్లో వరద ప్రభావంతో పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. గోదావరి వరద ఇంకా పూర్తి స్థాయిలో తగ్గుముఖం పట్టలేదు. ఈ నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

రూ.50 లక్షల పెట్టుబడి పెట్టా..



60 ఎకరాల్లో బొంత, కర్పూర అరటి పంటకు రూ.50 లక్షల పెట్టుబడి పెట్టా. పంట చేతికందే సమయంలో గోదావరి వరద అరటి తోటలను ముంచెత్తింది. పది రోజుల పాటు నీటిలో తోటలు మునిగి ఉండడం వల్ల అరటి చెట్ల ఆకులు ముగ్గిపోయి పడిపోతున్నాయి. గెలలు విరిగిపోతున్నాయి. ఇవి ఎందుకూ పనికి రాకుండా పోయాయి. తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.
–నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రైతు, కె.ఏనుగుపల్లి

క్లుప్తంగా

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం


దాత శ్రీనివాసరావు దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు అమలాపురానికి చెందిన శిఖా శ్రీనివాసరావు, నాగమణి దంపతులు గురువారం రూ.20,116 విరాళంగా సమర్పించారు. దీనిని ఆలయ ఉద్యోగులకు అందజేశారు. దాత శ్రీనివాసరావుకు ఆలయ ఈఓ గ్రంధి మాధవి ఆధ్వర్యంలో స్వామివారి చిత్రపటం, ప్రసాదం ఇచ్చారు.

ఖాతాదారులకు మరిన్ని సేవలు


లక్కవరంలో గోపాల కృష్ణంరాజును సత్కరిస్తున్న ఏజీఎం గణేష్

మలికిపురం: కెనరా బ్యాంక్ ద్వారా ఖాతాదారులకు మరిన్ని సేవలు అందిస్తామని బ్యాంకు కాకినాడ రీజియన్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్.గణేష్ అన్నారు. లక్కవరంలో కెనరా బ్యాంక్ బ్రాంచ్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ బ్రాంచ్ ఫౌండర్, లక్కవరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజును ఆయన అభినందించారు. బ్యాంకును రూ.8 కోట్ల టర్నోవర్‌కు చేర్చిన ఆయన్ని సన్మానించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ రాజా రవిరాం, ఆర్వో ఆఫీస్ సీనియర్ మేనేజర్ ముదునూరి పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

హడలెత్తించిన నల్లతాచు


నల్లతాచును బంధిస్తున్న స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ

అంబాజీపేట: ముక్కామల పశు వైద్యశాలలోని బీరువాలో నల్ల తాచు హడలెత్తించింది. ఆసుపత్రి సిబ్బంది గురువారం విధులు నిర్వహిస్తున్న సమయంలో బీరువాలో దాగి ఉన్న నల్లతాచును చూసి భయాందోళనకు గురయ్యారు. దీంతో భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం ఇచ్చారు. అతను సంఘటనా స్థలానికి చేరుకుని పామును పట్టుకుని ప్లాస్టిక్ డబ్బాలో బంధించారు. అనంతరం జనవాసం లేని ప్రాంతంలో పామును విడిచిపెట్టారు. వరదలు అధికంగా వస్తున్న నేపథ్యంలో పాముల బెడద ఎక్కువగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెబుతున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

అంబాజీపేట: పరిసరాల శుభ్రతతో సీజనల్ వ్యాధులను దూరం చేయవచ్చని సర్పంచ్ పేరాబత్తుల రామలింగరాజు (దొరబాబు) సూచించారు. తొండవరం పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న ప్రాథమిక పాఠశాల ఆవరణలో పారిశుధ్య పనులు చేపట్టారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా బయటకు మళ్లించామన్నారు. పంచాయతీ కార్యదర్శి వి.లక్ష్మీపతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్య సిబ్బంది జేవీఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మకు ఘన నివాళి

పి.గన్నవరం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి అపర అన్నపూర్ణ 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం'గా నామకరణం చేయడం శుభ పరిణామమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఎల్.గన్నవరంలో డొక్కా సీతమ్మ నివాసంలో ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే, నాయకులు పూలమాలలు వేశారు. సీతమ్మ జీవిత చరిత్రను డొక్కా నాథ్‌బాబు వివరించారు. సీతమ్మ వారి ఐదో తరానికి చెందిన డొక్కా భీమవెంకట సత్యకామేశ్వరరావు, లక్ష్మీప్రభ దంపతులను ఎమ్మెల్యే సత్కరించారు. జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల లక్ష్యం

కొత్తపేట: పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) అమలు చేస్తుందని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో పీఎంఏవై కింద కేంద్రం రూ.4 లక్షలు ఇస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు.

గంజాయితో ఏడుగురి అరెస్ట్

మలికిపురం: మండలంలోని గొల్లపాలెంలో గంజాయితో ఏడుగురిని అరెస్ట్ చేశారు. తహసీల్దార్ అనితకుమారి సమక్షంలో కేసు నమోదు చేసి, నిందితుల నుంచి 700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సంపత్ గురువారం తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పు చారిత్రాత్మకం


మామిడికుదురులో కృష్ణ మాదిగ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


మానేపల్లిలో కేట్ కట్ చేస్తున్న తెన్నేటి కిషోర్, తదితర నాయకులు

అంబాజీపేట: షెడ్యూల్ కులాల్లోని 59 ఉపకులాలు సామాజిక సమానత్వం పొందేందుకు ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని ఉత్తరాంధ్ర బీజేపీ ఇన్‌చార్జి, దండోరా కార్యకర్త కొల్లి సూర్యారావు అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పోరాటంతో ఇది సాధ్యమైందన్నారు. రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం మద్దతుతో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు అనుకూల తీర్పు ఇవ్వడం హర్షణీయమన్నారు. ఈ మేరకు స్థానిక సెంటర్లో యువత బాణసంచా కాల్చింది.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ సంబరాలు

మామిడికుదురు: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ ఎమ్మార్పీఎస్ నేతలు మామిడికుదురులో సంబరాలు నిర్వహించారు. మాజీ ఉప ప్రధాని, దివంగత నేత బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈదరాడ సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి కేక్ కట్ చేశారు. ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు ముసూడి నాగప్రభాకర్, నూటికుర్తి సత్యనారాయణ, చేట్ల సత్యనారాయణ, మంద గాంధీ, చుట్టుగుళ్ల కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు చారిత్రాత్మక తీర్పు ఇవ్వడం సంతోషకరమని ఎంఆర్పీఎస్ఎస్ జాతీయ అధ్యక్షుడు తెన్నేటి కిషోర్ అన్నారు. మానేపల్లిలో ఎంఆర్పీఎస్ఎస్ అధికార ప్రతినిధి ఉప్పాటి రాజేష్ ఆధ్వర్యంలో కిషోర్ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. అలాగే పి.గన్నవరం మూడు సెంటర్లో ఎంఆర్పీఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. మందా కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తవిటికి బుజ్జి, కొండేటి సురేష్, పెదపూడి రాము, ఈతకోట సత్యనారాయణ, అభిమన్యుడు తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలు అమృత తుల్యం


పెదపళ్లలో వైద్యారోగ్య సిబ్బంది ర్యాలీ

అంబాజీపేట: తల్లిపాలు బిడ్డలకు అమృత తుల్యమని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ అధికారి బి.అప్పారావు, పీహెచ్ఎన్ రత్నకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ సీఆర్వో పి.అనూష, సిబ్బంది పాల్గొన్నారు. తొండవరంలో వైద్యాధికారి వి.గౌతమి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

ఆలమూరు: పుట్టిన గంట లోపే బిడ్డకు తల్లి పాలు అందించడం శ్రేయస్కరమని కొత్తపేట డివిజన్ అడిషనల్ వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. చొప్పెల్ల, పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ఆయుష్మాన్ భారత్ మందిరాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో వైద్యారోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. గ్రామాల్లోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు అవగాహన సదస్సులు నిర్వహించి తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

మామిడికుదురు: పోషకాహారం ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి రమ్యశైలజ సూచించారు. తల్లి పాల వారోత్సవాన్ని పురస్కరించుకుని లూటుకుర్రు పీహెచ్‌సీ ఉద్యోగులు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

గ్రామాల్లో పింఛన్ల పంపిణీ


అంతర్వేదిపాలెంలో పింఛన్లను పంపిణీ చేస్తున్న ఆర్డీవో కేశవవర్ధన్ రెడ్డి

సఖినేటిపల్లి/ ఆలమూరు/ అయినవిల్లి/ మామిడికుదురు/ పి.గన్నవరం: సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెంలో గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అమలాపురం ఆర్డీఓ కేశవవర్ధన్ రెడ్డి పంపిణీ చేశారు. టేకిశెట్టిపాలెం, అంతర్వేదిపాలెం తులావారి కొట్లు వద్ద రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పింఛన్లు అందించారు. ఆలమూరు మండలం గుమ్మిలేరు, జొన్నాడ, సంధిపూడి, ఆలమూరు గ్రామాల్లో పింఛన్ల పంపిణీని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. ఈ మండలంలో తొలి రోజు 96.17 శాతం పూర్తయిందని ఎంపీడీఓ మేరీరోజ్ తెలిపారు. అయినవిల్లి మండలం అయినవిల్లిలంక, విలస గ్రామాల్లో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పింఛన్లను అందించారు. మామిడికుదురు మండలం పాశర్లపూడి, మొగలికుదురు గ్రామాల్లో లబ్ధిదారులకు ఎమ్మెల్యే సత్యనారాయణ పంపిణీ చేశారు. మగటపల్లిలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ నామన రాంబాబు, నగరంలో ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి, లూటుకుర్రులో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు అడబాల తాతకాపు లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. ఊడిమూడి, యర్రంశెట్టివారి పాలెం, ఎల్.గన్నవరం గ్రామాల్లో పింఛన్ల పంపిణీని ఎమ్మెల్యే గిడ్డి పరిశీలించారు.

ఇసుక విక్రయాలు పారదర్శకంగా చేపట్టాలి


రావులపాడు స్టాక్ పాయింట్ వద్ద విచారణ చేస్తున్న ముఖేష్ కుమార్ మీనా, కలెక్టర్ మహేష్‌కుమార్

రావులపాలెం: ప్రభుత్వం చేపట్టిన ఉచిత ఇసుక విధానం- 2024 ద్వారా పారదర్శకంగా విక్రయాలు నిర్వహించాలని రాష్ట్ర భూగర్భ గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. గురువారం రావులపాడు ఇసుక స్టాక్ యార్డును ఆయన సందర్శించారు. ఇటీవల ఆన్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా అందిన ఫిర్యాదులపై ఆయన విచారించారు. స్టాక్ యార్డ్‌లో ఎవరైనా ఇసుక సరఫరాకు అధికంగా డబ్బులు అడుగుతున్నారా అనే కోణంలో విచారణ చేశారు. ఇసుక ఏఏ భవన నిర్మాణాలకు వినియోగిస్తున్నది వినియోగదారుల ద్వారా ఆరా తీశారు. రోజువారీ ఇసుక విక్రయాల రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇసుక రవాణాకు నిబంధనల మేరకే చెల్లింపులు జరిపేలా పర్యవేక్షణ ఉండాలని, అధిక చార్జీలు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఉచిత ఇసుక సరఫరాకు సంబంధించి పరిపాలన పరమైన ఖర్చుల వివరాలతో కూడిన బోర్డులను స్పష్టంగా ప్రదర్శిస్తున్నామని తెలిపారు. వినియోగదారుల నుంచి పరిపాలనా పరమైన చార్జీలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆర్డీఓ జేవీవీ సత్యనారాయణ, తహసీల్దార్ అశోక్, ఖనిజాభివృద్ధి గనుల శాఖ అధికారి సాయిరాం సింగ్, సహాయ భూగర్భ గనుల శాఖ అధికారి జి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు. రావులపాడు, ఊబలంక, కొమరాజులంక గ్రామాలతోపాటు రావులపాలెంలోని డిగ్రీ కాలేజీ ఏరియా, అంకాలమ్మ గుడి ఏరియా, సీఆర్‌సీ రోడ్డు, ఆదిలక్ష్మీనగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. ఈతకోట సబ్‌స్టేషన్ పరిధిలో గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, దేవరపల్లి, మట్టలదొడ్డి, కేతరాజుపల్లి, చెల్లిరేవు, వెదిరేశ్వరం, కోసూరి నగర్, గరువు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు.

కొత్తపేట: మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ అమలాపురం ఈఈ రవికుమార్ తెలిపారు. ఏనుగులమహల్, మందపల్లి, కేదార్లంక, కొత్తపేట శివారు పలివెల వంతెన ఏరియాకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆలమూరు మండలంలో..

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల, ఆలమూరు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలగనుందని రామచంద్రపురం ఈఈ వై.విజయానంద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా మండలంలోని 18 గ్రామాలకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం


అంతర్వేదిలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో గురువారం ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం ఘనంగా జరిగింది. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణాన్ని అర్చకులు ప్రారంభించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకుడు పెద్దింటి వేంకట శ్రీనివాస్, వేద పండితులు ఈ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో కల్యాణంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం స్వామి మూలవిరాట్ దర్శనం కల్పించింది. అలాగే లడ్డూ ప్రసాదం ఇచ్చి, అన్నదాన పథకంలో భోజన సౌకర్యం ఏర్పాటు చేసింది.

నిబంధనలకు అనుగుణంగా కొబ్బరి కొనుగోళ్లు


అంబాజీపేటలో కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాఫెడ్ మేనేజర్ సుధాకర్‌రావు

అంబాజీపేట: స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన నాఫెడ్ కొనుగోలు కేంద్రం ద్వారా నిబంధనలకు అనుగుణంగా కొబ్బరిని కొనుగోలు చేస్తామని ఏపీ ఆయిల్ ఫెడ్ సీనియర్ మేనేజర్ యు.సుధాకరరావు తెలిపారు. అంబాజీపేట మార్కెట్ యార్డ్‌లోని కొబ్బరి కొనుగోలు కేంద్రంలో గురువారం కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ఎకరానికి రెండు బస్తాలు నెలకు విక్రయించుకోవాలన్నారు. రైతు ఒకేసారి రిజిస్ట్రేషన్ చేయించుకునే వీలుంటుందన్నారు. కొబ్బరి విక్రయించిన 15 రోజుల్లో రైతుల ఖాతాకు సొమ్ము జమ చేస్తామన్నారు. కొబ్బరి కొనుగోలు కేంద్రం సోమవారం నుంచి శుక్రవారం వరకూ పని చేస్తుందన్నారు. అంతకు ముందు కళ్లాలో ఆరబెట్టిన కొబ్బరిని సుధాకరరావు, కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ చైర్మన్ గణపతి వీరరాఘవులు, సీఈఓ అడ్డాల గోపాలకృష్ణ పరిశీలించారు.

కిడ్నీ బాధితుడికి సాయం

పి.గన్నవరం: ఎల్.గన్నవరంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కొల్లు రవీంద్రకు నామన ఫౌండేషన్ చైర్మన్ నామన రాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం రూ.10 వేల సాయాన్ని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అందజేశారు.

పుస్తకాల పంపిణీ

అయినవిల్లి: ముక్తేశ్వరం ఎస్ఎస్‌వీఆర్ కళాశాలలో ప్రిన్సిపల్ డి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉచితంగా రాత, పాఠ్య పుస్తకాలను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జైనుల్ అబేదీన్‌కు ఘన నివాళి


మొగలికుదురులో గుమ్మటం ఊరేగిస్తున్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లిం ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్ తనయుడు సయ్యద్ జైనుల్ అబేదీన్ షహదత్‌ను గురువారం ముస్లింలు నిండుశోకంతో నిర్వహించారు. ఇందులో భాగంగా మామిడికుదురు హజరత్ ఇమామ్ హుస్సేన్ పంజాలో అబ్రార్ హుస్సేన్ ఆధ్వర్యంలో మజ్లిస్ జరిగింది. మత ప్రబోధకుడు సయ్యద్ మీర్ హసన్ మషద్దీ మజ్లిస్ ఆలపించారు. మొగలికుదురులోని జగ్గన్నపేట పంజాలో షహదత్‌ను పురస్కరించుకుని గుమ్మటాన్ని ఊరేగించారు. గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించారు. మత ప్రబోధకుడు మిరాజ్ అలీ మజ్లిస్ ఆలపించారు.

శాకంబరిగా పెద్దింట్లమ్మ


కూరగాయలతో పెద్దింట్లమ్మ వారికి అలంకరణ

రావులపాలెం: ఆషాఢ మాసం సందర్భంగా రావులపాలెం కొత్త కాలనీలోని పెద్దింట్లమ్మ తల్లి శాకంబరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు శ్రీఅజయ్ శర్మ ఆధ్వర్యంలో ధర్మకర్త కోట చంద్రశేఖర్, పెద్దింట్లమ్మ యూత్ సభ్యులు పాల్గొని అమ్మవారికి కూరగాయలతో అలంకరణ చేశారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

రాజోలు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం కళాశాల ప్రిన్సిపాల్ జె.శాంతకుమారి అధ్యక్షతన ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ జరిగింది. ముఖ్య అతిథిగా ఎంపీపీ కేతా శ్రీనివాస్‌రావు పాల్గొని విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, వైస్ ఎంపీపీ ఆనందరాజు, సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీ దార్ల కుమారి లక్ష్మి, వార్డు మెంబర్ నామన షణ్ముఖ, ఎంఈఓ నల్లి మనోహరం పాల్గొన్నారు.

పశువుల దాణా అందజేత

పి.గన్నవరం: నాగుల్లంక గ్రామంలో పాడి రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చిన పశువుల దాణా బస్తాలను పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ కర్నీడి మూర్తి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి.గన్నవరం మండలంలో వరద ముంపునకు గురైన ప్రాంతాలకు 51 టన్నుల పశువుల దాణా కేటాయించామని, ఇప్పటికే 25 టన్నుల దాణాను రైతులకు అందజేశామన్నారు. పి.గన్నవరం ఏడీ ఎల్.విజయారెడ్డి, మండల పశువైద్య అధికారి కిరణ్ చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.